# సాక్షి పెద్దపల్లి

బుధవారం : 30 : ఆగస్టు : 2023






## ప్రమాదాల నివారణకు చర్యలు

గోదావరిఖని : గనుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్‌సూచించారు.

8లో▸




## విద్యుత్ అమరులకు నివాళి

గోదావరిఖని: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక లేబర్‌కోర్టు సమీపంలోని పైలాన్ వద్ద విద్యుత్ అమరులకు నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా మంగళగౌరీ వ్రతం



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు మంగళగౌరీ వ్రతాన్ని నిర్వహించారు. శ్రావణంలో ఈ వ్రతం నోచుకుంటే సంతానసౌభాగ్యం కలుగుతుందని భక్తులు పేర్కొన్నారు. ముందుగా మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. భక్తులకు పూజారి సంతోష్‌శర్మ తీర్థప్రసాదాలు అందించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కొమురవెల్లి భాస్కర్, జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

### గర్రెపల్లిలో కేంద్రబృందం పరిశీలన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లిలో కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖ సర్వే బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. గర్రెపల్లి గ్రామాన్ని రాష్ట్ర నుంచి అవార్డుకు ఎంపిక చేయడంపై కేంద్రబృందం సభ్యులు కిశోర్, సునీల్‌గౌడ్ పరిశీలించారు. పారిశుద్ధ్య వసతులు, స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ టాయిలెట్స్, ఇంకుడు గుంతలు, తడిపొడి చెత్త సేకరణ విధానంపై తెలుసుకున్నారు. సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీపీ బాలా జీరావు, డీఆర్‌డీఓ శ్రీధర్, ఎంపీడీఓ శశికళ, ఎంపీటీసీ పులి అనూష, ఎంపీఓ ఫయాజ్‌అలీ తదితరులు ఉన్నారు.

ఎలిగేడు: స్వచ్ఛసర్వేక్షణ్–2023లో భాగంగా మండలంలోని సుల్తాన్‌పూర్‌లో కేంద్రబృందం పర్యటించింది. ఇంకుడుగుంతలు, తడి, పొడి చెత్త నిర్వహణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించింది. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ బృందం కో–ఆర్డినేటర్ కిశోర్, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

### మహిళలకు ఆర్టీసీ లక్కీ డ్రా

గోదావరిఖనిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈనెల 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. సంస్థ ఆదేశాల మేరకు రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ టికెట్ వెనక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాబాక్సుల్లో వేయాలని తెలిపారు. సెప్టెంబర్ 9 లోపు రీజియన్‌ల వారీగా ముగ్గురు చొప్పున ఎంపిక చేసి రూ.5.50 లక్షల విలువైన బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### తగ్గిన సిలిండర్ ధర

| | |
|---|---|
| జిల్లాలో కనెక్షన్లు | 2,28,718 |
| దీపం పథకం | 33,387 |
| ఉజ్వల పథకం | 22,009 |



సుల్తానాబాద్: రాఖీ పండుగ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు తీపి కబురు అందించింది. గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గిస్తూ నిర్ణయించింది. ఉజ్వల పథకం లబ్ధిదారులకు ప్రస్తుతమున్న రూ.200కు తోడు మరో రూ.200 సబ్సిడీ అందించనుంది. జిల్లాలో మొత్తం కనెక్షన్లు 2,28,718 ఉండగా.. ఇందులో దీపం పథకం కింద 33,387, ఉజ్వల పథకం కింద 22,009 కనెక్షన్లు ఉన్నాయి. గ్యాస్ ధర తగ్గడం ద్వారా జిల్లాలోని వినియోగదారులకు సుమారు రూ.నాలుగు కోట్లకు పైగా భారం తగ్గనుంది.

### మట్టి వినాయకులనే పూజించాలి



మట్టి వినాయకుడిని ఇస్తున్న విద్యాసాగర్

పాలకుర్తి: మంటపాల్లో మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని ఉత్తర తెలంగాణ ప్రాంత హరితదళం ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని కన్నాల పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. చెరువు మట్టితో విగ్రహాలను తయారుచేయడం పూర్తిగా పర్యావరణ హితమని తెలిపారు.

# ఆశావహుల్లో డాక్టర్లే ఎక్కువ!

- ఏడుగురు వైద్యులు, ముగ్గురికి డాక్టరేట్లు
- బీటెక్ బాబులు, వకీల్‌సాబ్‌లకూ కొదవేం లేదు
- అన్ని పార్టీల నుంచీ ఎక్కువమంది పట్టభద్రులే
- ఉమ్మడి జిల్లా ఆశావహుల్లో విద్యాధికులే ఎక్కువ




సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలోపడ్డాయి. ఇందులో బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ఒకడుగు ముందే వేయగా.. కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుని కసరత్తు ప్రారంభించిది. ఇక బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికలో సీరియస్‌గానే పనిచేస్తోంది. మొత్తానికి అన్ని పార్టీల అభ్యర్థులకు అంగబలం, అర్థబలం, సామాజిక వర్గాలతోపాటు విద్యావంతులను ఎంపికచేసే పనిలోపడ్డాయి. ప్రస్తుతం పోటీకి సిద్ధంగా ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు దాదాపుగా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. అన్ని పార్టీలపరంగా ఆశావహుల విద్యార్హతలను పరిశీలిస్తే.. అందరిలో అధికంగా డాక్టర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో వకీల్‌సాబ్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, బీటెక్‌బాబులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో ఈసారి అసెంబ్లీ బరిలో ఉన్నత విద్యావంతుల చాలామంది నిలవనున్నారు.

**పదిమంది పేర్ల ముందు డాక్టర్**
1. డాక్టర్ సంజయ్, ఎంఎస్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–జగిత్యాల)
2. డాక్టర్ సంజయ్, ఎంఎస్, (బీఆర్‌ఎస్–కోరుట్ల)
3. డాక్టర్ భోగశ్రావణి, బీడీఎస్ (బీజేపీ–జగిత్యాల)
4. డాక్టర్ వికాస్‌బాబు, ఎంబీబీఎస్ (బీజేపీ– వేములవాడ)
5. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంఎస్ (కాంగ్రెస్–మానకొండూరు)
6. డాక్టర్ బల్మూరి వెంకట్, ఎంబీబీఎస్ (కాంగ్రెస్–హుజూరాబాద్)
7. డాక్టర్ జీఎన్ వెంకట్, ఎంబీబీఎస్ (బీజేపీ–కోరుట్ల)

**పీహెచ్‌డీ డాక్టర్లు**
8. డాక్టర్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–మానకొండూరు)
9. డాక్టర్ కొనగాల మహేశ్ (కాంగ్రెస్–కరీంనగర్)
10. డాక్టర్ మేడిపల్లి సత్యం (కాంగ్రెస్–చొప్పదండి)

**వకీల్‌సాబ్‌లు వీరే..**
1. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎల్‌ఎల్‌బీ ఎమ్మెల్యే (కాంగ్రెస్–మంథని)
2. టి.జీవన్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెల్సీ (కాంగ్రెస్–జగిత్యాల)
3. ఎ.మోహన్, ఎల్‌ఎల్‌బీ, మాజీ ఎమ్మెల్యే (మానకొండూరు)
4. కేకే మహేందర్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ (కాంగ్రెస్–సిరిసిల్ల)

**ఇంజినీర్ నేతలు..**
1. గంగుల కమలాకర్, బీటెక్(సివిల్) మంత్రి (బీఆర్‌ఎస్–కరీంనగర్)
2. దాసరి ఉష, బీఎస్సీ ఐఐటీ ఖరగ్‌పూర్ (పెద్దపల్లి, ఐఐటీ ఖరగ్‌పూర్)
3. చలిమెడ లక్ష్మీనరసింహారావు, బీటెక్ (బీఆర్‌ఎస్– వేములవాడ)
4. వొడితెల సతీశ్‌బాబు, ఎంటెక్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–హుస్నాబాద్)
5. నక్కా విజయ్‌బాబు, బీటెక్ (బీజేపీ– ధర్మపురి)

**పోస్ట్ గ్రాడ్యుయేట్**
1. కేటీఆర్, ఎంబీఏ(యూఎస్ఏ), మంత్రి (బీఆర్‌ఎస్–సిరిసిల్ల)
2. కోరుకంటి చందర్, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్– రామగుండం)
3. దాసరి మనోహర్‌రెడ్డి, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్– పెద్దపల్లి)
4. పొన్నం ప్రభాకర్, ఎంఏ, మాజీ ఎంపీ (కాంగ్రెస్– హుస్నాబాద్)
5. సోమారపు సత్యనారాయణ, పీజీ (బీజేపీ–రామగుండం)
6. జువ్వాడి నర్సింగరావు, పీజీ (కాంగ్రెస్–కోరుట్ల)

**గ్రాడ్యుయేట్లు**
1. ఈటల రాజేందర్, బీఎస్సీ, ఎమ్మెల్యే (బీజేపీ–హుజూరాబాద్)
2. బండి సంజయ్, డిగ్రీ, ఎంపీ (బీజేపీ–కరీంనగర్)
3. రోహిత్‌రావు, గ్రాడ్యుయేషన్ (ఆస్ట్రేలియా) (కరీంనగర్–కాంగ్రెస్)
4. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రాడ్యుయేట్ (కరీంనగర్–కాంగ్రెస్)

## అప్పన్నపేట ఘటనపై సమగ్ర విచారణ

- పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం
- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్, సభ్యురాలు శోభారాణి



వివరాలు సేకరిస్తున్న కమిషన్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో ఈనెల 14న బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగిన వ్యవహారంపై బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ బృందాదర్‌రావు, సభ్యురాలు శోభారాణి సమగ్ర విచారణ చేపట్టారు. జిల్లాకేంద్రంలో బాలిక తిరిగిన ప్రాంతాలతోపాటు బాలిక నివాసముండే ప్రాంతాన్ని మంగళవారం సందర్శించారు. ఆయా పరిసరాలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల నుంచి వివరాలు సేకరించారు. బాలికపై సామూహిక లైంగికదాడి జరిగిందా..? లేక ఆత్మహత్యకు పాల్పడిందా..? విషయాలపై సందేహాలు రావడంతో వాస్తవాలు తెలుసుకునేందుకే వచ్చామని సభ్యులు పేర్కొన్నారు.

**జిల్లాలోనే వలసకూలీలపై దాడులెక్కువ**

జిల్లావ్యాప్తంగా వివిధ పరిశ్రమల్లో పనిచేసే వలస కూలీల సంఖ్య ఎక్కువగానే ఉందని, అందుకు తగ్గట్టుగా వారిపై అఘాయిత్యాలు ఈప్రాంతంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయని బృందాదర్‌రావు, శోభారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి, రామగిరి మండలాల్లోని పలు ఇటుకబట్టీలను సందర్శించి వలసకూలీలకు కల్పించిన వసతులు పరిశీలించామన్నారు. వలస కూలీలకోసం అమలవుతున్న పథకాలు అర్హులందరికీ అందించేలా చూడాలని స్థానిక అధికారులను కోరారు. అప్పన్నపేట ఘటనను హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందన్నారు. తాము ఈ ప్రాంతంలో పర్యటించి సేకరించిన వివరాలతో ఓ నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రజాసంఘాలు, కలెక్టర్, జడ్జితోపాటు పలువురితో సమావేశమై వివరాలను నమోదు చేసుకున్నామని వివరించారు. వారివెంట జిల్లా సీడబ్ల్యూసీ ఛైర్మన్ శ్రీధర్, సుమలత తదితరులున్నారు.

**హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి**

బాలిక గ్యాంగ్‌రేప్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని ప్రజాసంఘాల నాయకులు బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్‌ను కోరారు. బాలిక కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలన్నారు. వలసకూలీలపై అఘాయిత్యాలు జరిగితే సమాచారమిచ్చేలా అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని మాదన కుమారస్వామి, రాజగోపాల్, పుల్ల సుచరిత, వినోద్, రవి తదితరులు కోరారు.

## కాంగి'రేస్'లో 85 మంది!



- దరఖాస్తుల వెల్లువ!
- పోటెత్తిన అభ్యర్థనలు
- అత్యధికంగా కరీంనగర్‌కు, అత్యల్పంగా జగిత్యాలకు
- 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ
- టికెట్‌పై అందరి ధీమా, మొదలైన పైరవీలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆశావహుల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో ఎన్నికలకు అధికార బీఆర్‌ఎస్ సమరశంఖం పూరించిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా పోటీకి నేతల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికి లీడర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్‌కు 15 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా జగిత్యాలకు ఒకే ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. గతంలోలా కాకుండా ఈసారి ఇప్పటికే తమ పార్టీ స్థితిగతులపై పలుదఫాలుగా సర్వేలు చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇపుడు ఆ సర్వే ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయించనుందని సమాచారం. సామాజిక వర్గాల వారీగా ఓసీ, బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తు సొమ్ము చెల్లించి మరీ తమ ఆకాంక్షను పార్టీకి తెలియజేశారు. ఈనెల 25తో దరఖాస్తులకు గడువు ముగియడంతో వాటి పరిశీలన మొదలైంది. ఈ వడపోత కార్యక్రమం ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటిస్తారా? లేక కొత్తగా పార్టీలో చేరేవారికి దరఖాస్తుకు మరోసారి గడువు పెంచుతారా? అన్న విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు ఎవరి పైరవీలు వారు ప్రారంభించారు. తమకే టికెట్ కేటాయించాలని, ఒక్కఛాన్స్, చివరి చాన్స్ అంటూ అన్ని రకాల యత్నాలు చేస్తున్నారు.

**13 నియోజకవర్గాల్లో దరఖాస్తులు ఇలా..**

**కరీంనగర్–15:** రేగులపాటి రమ్యారావు, మేనేని రోహిత్‌రావు, డాక్టర్ కొనగాల మహేశ్, వైద్యుల అంజన్‌కుమార్, మొహమ్మద్ అబ్దుల్ షమీద్ (నవాబ్), కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్, జువ్వాడి నిఖిల్ చక్రవర్తి, రేగులపాటి రితీశ్‌రావు, సత్తు మల్లయ్య, కర్ర సత్యప్రసన్న, పడాల రాహుల్, ఎండీ రహమత్ హుస్సేన్, కొత్త జైపాల్‌రెడ్డి.

**చొప్పదండి–7:** మేడిపల్లి సత్యం, జిల్లాల భానుప్రియ, వెన్న రాజమల్లయ్య, కాశిపాక రాజేశ్, చిగురు శకుంతల, నాగి శేఖర్, మైక లక్ష్మణ్.

**మానకొండూర్–2:** డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తిప్పారపు సంపత్.

**హుజూరాబాద్–13:** పాతి రామకృష్ణారెడ్డి, జాలి కమలాకర్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, ప్యాట రమేశ్, కె.బుచ్చిరెడ్డి, గూడెపు సారంగాపాణి, బల్మూరి వెంకట నర్సింగ్‌రావు, టి.రవీందర్, కశ్యప్ రెడ్డి ముద్దసాని, సాయిని, రవికుమార్, పూదరి రేణుక, దాసరి భూమయ్య, తిప్పారపు సంపత్.

**హుస్నాబాద్–06:** పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, బాలిశెట్టి శివయ్య, వొంటెల రత్నాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్.

**పెద్దపల్లి–05:** కిరణ్‌కుమార్ వెల్పుల, చింతకుంట విజయరమణారావు, గంట రాములు, చేతి ధర్మయ్య, ఈర్ల కొమురయ్య.

**రామగుండం–06:** ఎంఎస్.రాజ్‌ఠాకూర్, హర్కర వేణుగోపాల్‌రావు, బాజ్‌పాల్ జనక్‌ప్రసాద్, అంచర్ల మహేశ్ యాదవ్, రియాజొద్దీన్ అహ్మద్, గంట సత్యనారాయణరెడ్డి

**మంథని–02:** దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శివనాద్రి ప్రమోద్‌కుమార్.

**వేములవాడ–04:** ఆది శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్ యాదవ్, టి.అంజయ్యయాదవ్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

**సిరిసిల్ల–04:** సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, నాగుల సత్యనారాయణ, కేకే.మహేందర్‌రెడ్డి.

**జగిత్యాల–01:** తాటిపర్తి జీవన్‌రెడ్డి.

**కోరుట్ల–13:** కల్వకుంట్ల సుజిత్‌రావు, కొమొరెడ్డి జ్యోతిదేవి, జువ్వాడి నర్సింగరావు, రుద్ర శ్రీనివాస్, రుద్ర శంకర్, మొహమ్మద్ షకీర్ సిద్దిఖీ, కొమొరెడ్డి కరమ్ చంద్, కోట దుర్గారాజ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఆసిఫ్ హబీబ్, అలే పాండురంగా, మొహమ్మద్ హబీబ్ ఖాన్.

**ధర్మపురి–07:** అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గజ్జెల స్వామి, వడ్లూరి కృష్ణ, గుమ్మడి కుమారస్వామి, బండారి కనుకయ్య, రవీందర్ మద్దెల, బొల్లి స్వామి.

## అబద్ధాలతో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర

- కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు అరిగోస పడ్డారు
- ప్రజలకు అండగా ఉంటున్న బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి
- ధర్మారంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ధర్మారం: కాంగ్రెస్ నాయకులు అబద్ధపు హామీలతో అధికారంలోకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. మండలకేంద్రంతోపాటు కొత్తూరు, న్యూకొత్తపల్లి, చామనపల్లి, నందిమేడారంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తూరులో మన ఊరు– మనబడి కింద రూ.70లక్షలతో చేపట్టిన గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అధికార వ్యామోహంతో కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యంగానీ హామీలు ఇస్తోందని తెలిపారు. కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రైతులు, విద్యార్థులు తల్లడిల్లారని గుర్తుచేశారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు. మంచి పనులు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సర్పంచులు పూస్కూరి జితేందర్‌రావు, తాళ్ల మల్లేశం, తిరుపతి, జానకి, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సహకార సంఘాల ఫోరం జిల్లా ఛైర్మన్ బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్ విండో ఛైర్మన్ నోముల వెంకటరెడ్డి, పుస్కూరి రామారావు, తహసీల్దార్ రజనీ, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, శ్రీనివాస్, తుమ్మల రాంబాబు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు**

కొత్తూరు, ఖిలావనపర్తి గ్రామాలకు చెందిన యువకులు మంత్రి ఈశ్వర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**మంత్రిని కలిసిన విద్యుత్ కార్మిక నాయకులు**

కొత్తూరు పర్యటనకు వచ్చిన ఈశ్వర్‌ను రాష్ట్ర విద్యుత్ సంఘం హెచ్ 58 యూనియన్ నాయకులు కలిసి సన్మానించారు. పెద్దపల్లి డివిజన్ అధ్యక్షుడు గర్శిళ్ల ప్రవీణ్‌కుమార్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ధరమ్‌సింగ్, కోశాధికారి సింగమల నర్సింగ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చొప్పరి హన్మండ్లు, జేఎస్‌ఎంలు పాల్గొన్నారు.

## గద్దర్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధు
- కళాకారుల ఆధ్వర్యంలో మంథనిలో సంతాప సభ



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: పేదలను బానిసత్వం, ఆకలి నుంచి దూరం చేసేందుకు అడవిబాట పట్టిన గద్దర్ జన నాట్య మండలిని స్థాపించి తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం తెచ్చారని, చివరకు అంబేద్కర్ అందించిన ఓటుతోనే మార్పు సాధ్యమని భావించారని జెడ్పీ ఛైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని ప్రధాన చౌరస్తాలో డివిజన్ కళాకారుల ఆధ్వర్యంలో గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మధు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఒకప్పుడు మహదేవ్‌పూర్‌లో కొమురంభీం విగ్రహావిష్కరణకు వచ్చిన గద్దర్‌ను మాట్లాడకుండా అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు నివాళి అర్పిస్తున్నారని పేర్కొన్నారు. ఓటు విలువను తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, కళాకారులు ఏట రవితో పాటు ఉన్నారు.

**భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం**

సింగరేణి భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మధు తెలిపారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 విస్తరణలో నిర్వాసితులైన మంథని మండలం అక్కెపల్లి పరిధి తుర్కపల్లి నిర్వాసితులకు నివాస స్థల పట్టాలు పంపిణీ చేశారు. తాను ఎమ్మెల్యే కాకముందు సింగరేణి సంస్థ అనేక ప్రభావిత గ్రామాల్లో భూసేకరణ చేసిందని, నిర్వాసితులకు న్యాయం జరగక ఎక్కడెక్కడో స్థిరపడ్డారని, తన హయాంలో అలాంటి పరిస్థితులు రాకుండా చూశానని పేర్కొన్నారు. అధికారులను ఒప్పించి నిర్వాసితులకు న్యాయం చేశామని గుర్తు చేశారు.

## వ్యాయామం, క్రీడలతో ఆరోగ్యం

- ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



క్రికెట్ ఆడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని, క్రీడలతో ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన చలో మైదాన్ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. జాతీయ హాకీ జట్టుకు నాయకత్వ వహించిన మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.

**ఓటుహక్కు విలువైంది..**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఎన్నికల్లో తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్, జిల్లా అధికారులు సురేశ్, రంగారెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్ ఉన్నారు.

**మహిళలకు మెరుగైన వైద్యం అందించాలి**

మహిళా ఆరోగ్య కేంద్రాలకు వచ్చేవారికి మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. చీకురాయి రోడ్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించారు. సేవలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు.





## వైభవంగా ఆదివరాహస్వామి జయంతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలను మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. 101 కలశాలు ఏర్పాటు చేసి.. హోమం కాల్చారు. జెడ్పీ ఛైర్మన్ పుట్ట మధు, మంథని ఆర్డీవో హనుమా నాయక్ హాజరై స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఛైర్‌పర్సన్ ఇనగంటి ప్రేమలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, కమాన్‌పూర్ ఎస్సై రాములు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఆవరణలో చిన్నారుల నృత్యాలు భక్తులను అకట్టుకున్నాయి. గుండారం ప్రభుత్వ పాఠశాల చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.

## క్లుప్తంగా

### ఆడబిడ్డకు అండగా ఉండాలి



కార్మికులకు రాఖీలు కడుతున్న సంధ్యారాణి

**జ్యోతినగర్(రామగుండం):** రక్షాబంధన్ పురస్కరించుకుని మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి రాఖీలు కట్టి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలంతా ఘనంగా జరుపుకునే రక్షాబంధన్ సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ సోదరులకు అనురాగంతో చేతికి రాఖీ కట్టడం గొప్ప సంప్రదాయమని, అదే ఉద్దేశంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మిక అన్నలనే తన సోదరులుగా భావిస్తూ ఏటా రాఖీలు కట్టడం జరుగుతుందన్నారు. అందరి ఆశీస్సులతో ముందుకు సాగుతున్నానని, ఆడబిడ్డకు అండగా ఉండాలని కార్మికులను కోరారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో తాను గెలిపించిన నాయకులు మోసం చేస్తే, ప్రజలు తమకు అండగా ఉండి గెలిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ, రజిత, మంగ, రాజన్న, ప్రభాకర్, పవన్, తాజ్, వేణు, నారాయణ, రాయలింగు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి సివిల్ అధికారుల సందర్శన



మేడిపల్లిలో సింగరేణి సివిల్ అధికారులు

**జ్యోతినగర్(రామగుండం):** సింగరేణి ప్రభావిత మేడిపల్లి గ్రామాన్ని మంగళవారం సంస్థ సివిల్ విభాగానికి చెందిన అధికారులు సందర్శించారు. రామగుండం కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ అధికారులతో పర్యటించి గ్రామంలోని పరిస్థితులను వివరించారు. ఓపెన్‌కాస్ట్–4తో నష్టపోయిన గ్రామ అభివృద్ధికి సంస్థ సహకరించాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరిన క్రమంలో ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు గ్రామంలో అధికారులు పర్యటించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

### 'సింగరేణిలో అవినీతి పెరిగిపోయింది'



మాట్లాడుతున్న రియాజ్‌అహ్మద్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణిలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతోందని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు సంఘం కార్మికుల సమస్యలు పక్కనపెట్టి దొంగనాటకాలు ఆడుతుందన్నారు. కార్మికులకు ప్లే డేలు సమానంగా కల్పించడం లేదని, గెలిచిన సంఘం కాలపరిమితి ముగిసినా, ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తూ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఓసీపీ–3లో కాంట్రాక్టు కార్మికుడు చనిపోవడానికి కారణం సేఫ్టీ నిబంధనలు పట్టించుకోకపోవడమే అని అన్నారు. సమావేశంలో నాయకులు దావు రమేష్, రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# అసలేం జరిగింది..!?

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి
- ఇంట్లో ఉన్నది అక్కాచెల్లెళ్లు మాత్రమే
- యువకుడితో చెల్లి వెళ్లిపోయిందా..?
- బస్టాండ్ సీసీ ఫుటేజీల్లో దృశ్యాలు



దీప్తి (ఫైల్)



దీప్తి మృతదేహం

**కోరుట్ల:** 'సోమవారం రాత్రి ఆ ఇంట్లో అక్కాచెల్లెళ్లు మాత్రమే ఉన్నారు. తెల్లారేసరికి అక్క చనిపోయి సోఫాలో పడి ఉంది. ఇంటి బయట తలుపునకు గొళ్లెం పెట్టి చెల్లి ప్రియుడితో కలిసి పరారైంది'. ఇంట్లోని కిచెన్‌లో ఓడ్కా, బ్రీజర్ బాటిళ్లు ఉన్నాయి. అసలు ఆ రాత్రి ఇంట్లో ఏం జరిగి ఉంటుంది..? అక్క చనిపోవడానికి చెల్లెలే కారణమా..? ప్రియుడితో కలిసి చెల్లె వెళ్లిపోతుంటే అక్క అడ్డుకున్న క్రమంలో గొడవ జరిగిందా.. ఈ గొడవలోనే అక్క ప్రాణాలు పోయాయా..? లేదా ఓడ్కాలో అక్కకు మత్తు ఇచ్చి చెల్లెలు గుర్తుతెలియని యువకుడితో కలిసి పరారైందా..? వోడ్కాలో కలిపిన మత్తు మందు డోసు ఎక్కువై అక్క చనిపోయిందా..?!

**అనేక అనుమానాలు**

కోరుట్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి మృతి వెనక లెక్కలేని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రకు చెందిన బంక శ్రీనివాస్‌రెడ్డి–మాధవి దంపతులు సుమారు పాతికేళ్లుగా కోరుట్లలోని భీమునిదుబ్బలో స్థిరపడ్డారు. ఇటుకబట్టీ వ్యాపారం చేసుకునే శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెద్ద కూతురు దీప్తి(24) పుణేలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోం పద్ధతిన ఇంట్లో నుంచి పనిచేస్తోంది. చిన్నకూతురు చందన ఇటీవల బీటెక్ పూర్తి చేసింది. సోమవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి– మాధవి హైదరాబాద్‌లోని బంధువుల గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్లగా దీప్తి, చందన మాత్రమే ఇంట్లో ఉన్నారు. రాత్రి 10 గంటల వరకు తండ్రితో అక్కాచెల్లెళ్లు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

**తెల్లారేసరికి..**

మంగళవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లతో మాట్లాడటానికి ప్రయత్నించగా పెద్ద కూతురు దీప్తి ఫోన్ లిఫ్ట్ కాలేదు. చిన్నకూతురు చందన ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. రెండుమూడు సార్లు ఫోన్‌లో కూతుళ్లతో మాట్లాడేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డి చివరికి పక్క ఇంట్లో ఉన్నవారికి ఫోన్ చేశాడు. తమ కూతుళ్లు ఫోన్ ఎత్తడం లేదని చెప్పి, ఓ సారి ఇంటిదాకా వెళ్లి చూడమని కోరాడు. పక్క ఇంట్లో ఉండే ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపు బయట నుంచి గొళ్లెం పెట్టి ఉంది. పిలిస్తే ఎవరూ పలకలేదు. దీంతో తలుపు గొళ్లెం తీసి లోపలికి వెళ్లి చూడగా పెద్ద కూతురు దీప్తి సోఫాలో పడిపోయి ఉంది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా వారు దీప్తిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. బంధువులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్, చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

**ఆ రాత్రి ఏం జరిగినట్లు..?**

సోమవారం ఉదయం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని బంధువు ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లగా రాత్రి అక్కాచెల్లెల్లు ఇద్దరే ఇంట్లో ఉన్నారు. కిచెన్‌లో వోడ్కా, బ్రీజర్ బాటిళ్లు, వెనిగర్, నిమ్మకాయలు ఉండటంతో రాత్రి వేళ దీప్తి, చందన కలిసి మద్యం సేవించారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి మద్యం బాటిళ్లు ఎవరు తెచ్చి ఇచ్చారు, ప్రియుడితో కలిసి పరారయ్యేందుకు ముందుగానే పథకం వేసుకున్న చందన అతడితోనే మద్యం తెప్పించి ముగ్గురు కలిసి మద్యం తీసుకున్నారా..? అన్న విషయంలో స్పష్టత లేదు. దీప్తికి మద్యంలో మత్తు కలిపి తాము పరారయ్యేందుకు పథకం వేశారా..? మత్తు డోసు ఎక్కువ కావడంతో దీప్తి మృతి చెంది ఉంటుందా..? అన్న అనుమానాలున్నాయి. చందన ప్రియుడితో కలిసి వెళ్లిపోయే ప్రయత్నాన్ని దీప్తి అడ్డుకునే క్రమంలో గొడవ జరిగి ఆ గొడవలో తగలరాని చోట దెబ్బతగిలి దీప్తి చనిపోయిందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీప్తి శరీరంపై పెద్దగా గాయాలు కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

**బస్టాండ్ సీసీ పుటేజీలో చందన..**

కోరుట్ల బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో మంగళవారం వేకువజామున 5 గంటలకు చందన ఓ యువకుడితో కలిసి ఉన్న ఫుటేజీలను పోలీసులు గుర్తించారు. చందన, మరో యువకుడు లగేజీ తీసుకుని నిజామాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. చందన ఫోన్‌కాల్ డేటా ఆధారంగా ఆమె ఓ యువకుడితో గంటల తరబడి ఫోన్ మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి చందన ఫోన్ లొకేషన్ హైదరాబాద్‌లో వస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారని సమాచారం. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## రైల్వే ఆస్తుల పరిరక్షణలో ఆర్‌పీఎఫ్ కీలకం

- దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ ఠాకూర్ ఆరోమాసింగ్



సమీక్షిస్తున్న ఐజీ ఠాకూర్ ఆరోమాసింగ్

**రామగుండం:** దక్షిణ మధ్య రైల్వే ఆస్తుల పరిరక్షణలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కీలక భూమిక పోషిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రయాణికుల భద్రతా చర్యలపై ప్రత్యేక నిఘాతో అప్రమత్తంగా వ్యవహరిస్తామని దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ ఠాకూర్ ఆరోమాసింగ్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో నేరుగా బెల్లంపల్లికి వెళ్లి కమర్షియల్ విభాగంలో జరిగిన టికెట్ల కుంభకోణం కేసు విచారణ చేపట్టారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా రామగుండం చేరుకొని రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో భద్రతా బలగాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల రైళ్లలో అక్రమంగా గంజాయి, నల్లబెల్లం, కలప రవాణా, రైల్వే ఆస్తుల చోరీ తదితర అంశాలపై సమీక్షిస్తూ, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ సత్వర చర్యలు చేపట్టిన రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ సురేశ్‌గౌడ్ పనితీరును అభినందించారు. రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు, ఆటో పార్కింగ్ స్టాండు తదితర అంశాలపై మాట్లాడారు. రామగుండం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దడంతో త్వరలోనే మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సికింద్రాబాద్ డివిజనల్ కమిషనర్ దేబాస్మిత సి.బెనర్జీ, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న రామాచారి, కార్మికులు

**రామగుండం:** రైల్వే ఓవర్ హాలింగ్ షెడ్‌లో కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న మహిళా కార్మికులు 15 మందికి ఉద్యోగ భద్రత కల్పించి ప్రతీ నెలలో 26 పనిదినాలు కల్పించాలని, హౌజ్ కీపింగ్, గార్డెన్, కిందపడిన బొగ్గు ఏరివేయడం, ఫిట్టర్, వెల్డర్లకు సహాయకులుగా తదితర విధుల్లో మహిళలు కొనసాగుతున్నారన్నారు. ఇటీవల నూతనంగా కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ మ్యాన్‌పవర్ సప్లయ్ నుంచి జాబ్ రేట్ పద్ధతి పాటిస్తుండడంతో రోజూ పని కల్పించే అవకాశం లేకుండా పోవడంతో ఉద్యోగ భద్రత కరువైందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రతీ నెలా 26 రోజుల పని దినాలు కల్పించాలని, ప్రభుత్వపరంగా వర్తించే అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, కార్మికులు స్వరూప, సరళ, మహేంద్ర, ఎల్లమ్మ, లక్ష్మి, విజయ తదితరులున్నారు.

## పట్టపగలే మహిళ దారుణహత్య



జల (ఫైల్)

**రాయికల్:(జగిత్యాల):** రాయికల్ పట్టణంలోని నాగారంవాడలో మంగళవారం పట్టపగలే కోల జల (48) దారుణహత్యకు గురైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జల భర్త సత్తయ్య, కొడుకు శేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. కూతురు రమ్యను ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. జల తన ఇంట్లో ఒక్కతే నివసిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలోని చెన్నకేశవ నాథ ఆలయానికి వెళ్లి పూజలు చేసింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో భోజనం చేసి నిద్రిస్తుంది. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి జల పుస్తెలతాడును దోచుకెళ్లే క్రమంలో ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రోజూ సాయంత్రం పూట ఆరుబయటకు వచ్చే జల రాకపోవడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తం మరకలతో బోర్లాపడి ఉంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌ఖాన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. కోల జలను దుండగులు హత్య చేసి పుస్తెలతాడును దోచుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌నాయక్ తెలిపారు. ఏదేమైనా రాయికల్ పట్టణంలో పట్టపగలే మహిళ హత్యకు గురికావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

## ఆశయాలకనుగుణంగా ముందుకెళ్లాలి



పోలీసులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

**గోదావరిఖని:** తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లి ఉన్నతస్థాయికి ఎదగాలని పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక బృందావన్‌గార్డెన్‌లో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. షీటీమ్స్, సైబర్ క్రైం, డయల్ 100, ట్రాఫిక్ రూల్స్, ఉమెన్ సేఫ్టీ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ప్రమాదం, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేసి పోలీస్ సహాయం పొందాలని సూచించారు. కళాశాలకు వచ్చిపోయే సమయంలో ఆకతాయిలు వేధిస్తే వెంటనే 100కు గానీ, రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీమ్ వాట్సాప్ నెంబర్ 63039 23700 నంబర్ కాల్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్‌ఐలకు, పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీ తులా శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోదరావు, ప్రసాద్‌రావు, సైబర్ క్రైం రహీంపాషా, పెద్దపల్లి షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సైలు స్వామి, సమ్మయ్య, సుగుణాకర్, శరణ్య, సౌజన్య, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ తరలిన ఐఎఫ్‌టీయూ నాయకులు



హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాన్నికి ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ ఐఎఫ్‌టీయూ నాయకులు తరలివెళ్లారు. ధర్నాకు వెళ్లినవారిలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ తదితరులు ఉన్నారు.

### మ్యూజిక్ డైరెక్టర్‌కు మాతృవియోగం



తల్లి అంత్యక్రియల్లో సుధాకర్

**ఎలిగేడు(పెద్దపల్లి):** మండల కేంద్రానికి చెందిన సినిమా మ్యూజిక్ డైరెక్టర్ వెంగళదాసు సుధాకర్(వెంగి) తల్లి వరలక్ష్మి (85) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందింది. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి చితికి సుధాకర్ నిప్పంటించారు. అంత్యక్రియల్లో సినీ నేపథ్య గాయకుడు, నటుడు రాహుల్‌సిప్లిగంజ్, డ్యాన్స్ మాస్టర్ గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### చంపుతామని బెదిరించిన వ్యక్తిపై కేసు

**పెద్దపల్లిరూరల్:** అప్పుగా ఇచ్చిన డబ్బులు అడిగితే చంపుతామని కట్ట నరేంద్రాచారి బెదిరిస్తున్నాడంటూ కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లికి చెందిన దుర్గం లక్ష్మణ్ దంపతులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు పెద్దపల్లిలోని భూంనగర్‌లో నరేంద్రచారి ఇంటి వద్ద బాధితులు నిరసనకు దిగారు. తమకు నరేంద్రచారితో ప్రాణ భయం ఉందని, తమ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### గంగాప్రసాద్ కుటుంబానికి అండగా నిలవాలి



సంతాప సభలో నాయకులు

**గోదావరిఖని:** గంగాప్రసాద్ కుటుంబానికి కార్మికులంతా అండగా నిలవాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌వీఆర్ ప్రవేట్‌ఓబీ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపద సమయంలో కార్మికులు ఐక్యంగా ఉండాలన్నారు. ఆర్‌వీఆర్ యాజమాన్యంతో జరిగిన ఒప్పందాన్ని కార్మికులకు వివరంగా తెలియజేశారు. అలాగే సింగరేణి యాజమాన్యానికి తెలియకుండా గంగాప్రసాద్ మృతదేహాన్ని మాయం చేసేందుకు కుట్రపన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కె.విశ్వనాథ్, రాజరత్నం, అబ్దుల్ గని, దావు రమేష్ పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

## ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్



సమావేశంలో డైరెక్టర్లు, జీఎంలు

**గోదావరిఖని(రామగుండం):** గనుల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక ఇల్లెందు క్లబ్‌లో గనుల్లో రక్షణచర్యలు పెంపొందించుకు చేపట్టాల్సిన చర్యలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. పలు రక్షణ అంశాలపై చర్చించారు. బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా అయ్యే వరకు ప్రతి చోట తగిన రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. ఈసందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, ప్రమాదాలు అరికట్టేందుకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఆర్జీ–1 ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, అడ్రియాల ప్రాజెక్టు జీఎం వెంకటేశ్వర్‌రావు, భూపాల్‌పల్లి జీఎం బళ్లారి శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారులు రవీందర్, సత్యనారాయణ, వెంకటరమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

**రామగిరి(మంథని):** ఉద్యోగులు తప్పకుండా విధులకు హాజరుకావాలని ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గైర్హాజరైన ఆర్జీ–3, ఏపీఏ ఉద్యోగులకు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 106 మంది కార్మికులను కౌన్సెలింగ్‌కు పిలవగా 46 మంది హాజరయ్యారు. విధులకు హాజరు కాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. విధులకు హాజరైతే కలిగే ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న కారణాలతో గైర్హాజరు కావడం వల్ల వ్యక్తిగతంగా వేతనాలు కోల్పోవడంతో పాటు ఉత్పత్తి పరంగా సంస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, అనారోగ్య సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవస్తే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. నిబద్ధతతో క్రమం తప్పకుండా పనిచేస్తూ యాజమాన్యం కల్పించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, అధికారుల సంఘం ప్రతినిధి నాగేశ్వర్‌రావు, డీవైపీఎం రవీందర్, డిప్యూటీ డీవైపీఎంలు శ్రీహరి, సునీల్‌ప్రసాద్, హరీశ్, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరచారి, సీనియర్ పీవోలు మురళి, మతిన్ హుస్సేన్, కార్మిక సంఘాల నాయకులు గౌతం శంకరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు రవాణా పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం, అధికారులు

**గోదావరిఖని(రామగుండం):** బొగ్గు రవాణా పెంచేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోల్‌మూమెంట్ ఈడీ అల్విన్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి ఎన్టీపీసీకి రవాణా అవుతున్న రేక్‌ల వివరాలను తెలుసుకున్నారు. బొగ్గు అవసరాల దృష్ట్యా బొగ్గు రేక్‌ల సంఖ్య పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. రోజుకు 7 వేల టన్నుల నుంచి 12 వేల టన్నులకు బొగ్గు రవాణా పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోజుకు 3 రేకుల బొగ్గు రవాణా పెంచేలా ఏర్పాట్లు చేసినట్లు జీఎం సూర్యనారాయణ వెల్లడించారు. సమావేశంలో సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందం, క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలి



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

**గోదావరిఖని(రామగుండం):** కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు వేజ్‌బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ సెప్టెంబర్ నెల జీతాలతో కలిపి చెల్లించాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించామని, రూ.32,184 కోట్లు ఆర్జించినట్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ప్రకటించారన్నారు. అయినా వేజ్‌బోర్డు ఏరియర్స్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే చెల్లించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బూర్ల లక్ష్మీనారాయణ, పొన్నమనేని వేణుగోపాలరావు, ఆకుల హరిణ్, సాయవేణి సతీష్, వడ్డేపల్లి కుమారస్వామి, మాదాసి రవీందర్, పల్లె శ్రీనివాస్, పోతరాజు భాస్కర్, బోడకుంట రాజేశం, ఎల్లావుల కోటయ్య, నూతి శ్రీమన్నారాయణ, వీర మహేష్ పాల్గొన్నారు.

**ఏరియర్స్ చెల్లించాలి**

**రామగిరి(మంథని):** కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియార్స్ చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు వేణుగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీతోనే సమస్యలు పరిష్కారం



సమావేశంలో నాయకులు

**గోదావరిఖని(రామగుండం):** ఏఐటీయూసీతోనే కార్మిక సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 8 దశాబ్దాలకుపైగా కార్మికుల హక్కుల సాధనలో యూనియన్ ముందంజలో ఉందన్నారు. సంస్థగతంగా రెండు రోజుల క్రితం నిర్వహించిన మహాసభల్లో కేంద్ర కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. ఇలాంటి పద్ధతి ఇతర యూనియన్‌లలో లేదన్నారు. అలాగే యూనియన్ పేరుతో బ్యాంకు అకౌంట్ నిర్వహిస్తూ కార్మికులకు జవాబుదారీగా పనిచేస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో నాయకులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోషం, కె.కనకరాజ్, గోసిక మోహన్, గౌతం గోవర్దన్, కన్నం లక్ష్మీనారాయణ, ఎంఏ గౌస్, శనగల శ్రీనివాస్, సంకె అశోక్, అఫ్రోజ్ ఖాన్, మానాల శ్రీనివాస్, టి.మల్లయ్య, మద్దెల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసీపీ–1ను సందర్శించిన ఆపరేషన్స్ డైరెక్టర్



క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

**గోదావరిఖని(రామగుండం):** రామగుండం డివిజన్–3 పరిధి ఓసీపీ–1 ప్రాజెక్టును డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా క్వారీని పరిశీలించి రక్షణ అంశాలపై చర్చించారు. ఆఫ్ లోడింగ్ ఓబీ, వాటర్ పంపింగ్ తీరును పరిశీలించారు. సంస్థ ద్వారా వచ్చే ఉత్పత్తి, ఉత్పాదకత తీరును తెలుసుకున్నారు. డైరెక్టర్ వెంట ఎస్‌ఓటూ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్జీ–3 జీఎం సుధాకర్, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, పీఈ శ్రీనివాస్, ఎస్‌ఓఎం ఉదయ్‌హరిజన్, సేఫ్టీ అధికారి కోటయ్య తదితరులున్నారు.

## 'హెచ్‌డీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**రామగిరి(మంథని):** ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1లో పనులు నిర్వహిస్తున్న హెచ్‌డీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎస్‌వోటూ జీఎం రఘుపతికి బీజేపీ నాయకుడు ముల్మూరి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. సదరు కంపెనీలో సుమారు 300 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా పట్టించుకోవడం లేదని, వసతులు కల్పించడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో పనిఒత్తిడికి గురి చేస్తున్నారని, స్థానికులు కాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కుంటూన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే కార్మికులకు మౌలిక వసతులు కల్పించేలా సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని లేకుంటే బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్ ఉన్నారు.